ప్రజాశక్తి
గురువారం 11 మే 2023
5
అల్లూరి సీతారామరాజు



గిరిజన బాలికపై అత్యాచారం

కప్పి పుచ్చుకునేందుకు ప్రయత్నాలు

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి -అనంతగిరి:అమాయక గిరిజన బాలికలతో వెట్టిచాకిరి పనులు చేయింయడమే కాకుండా మాయ మాటలు చెప్పి నమ్మబలించి అత్యాచారంకు పాల్పడిన ఘటన మండలం లోని బొర్రాలో చోటు చేసుకుంది. బొర్రాలోని ఓ హోటల్ యజమాని అదే పంచాయతీకి చెందిన ఓ అమ్మాయితో రాత్రి పగలు తేడా లేకుండా వివిధ పనులు చేయించాడు.కొని రోజుల తర్వాత లోబర్చుకుని మాయమాటలు చెప్పి డబ్బును ఆశచూపి ఏకంగా గర్భవతిని చేశాడు. ఈ విషయాన్ని కప్పు పుచ్చుకునేందుకు ఆ హెూటల్ యజమాని పంచాయితీ పెద్దలతో చేతులు కలిపాడు. బాలికను ఎంతో కొంత డబ్బులు ఇచ్చి బయట పొక్క కుండా ఉండేందుకు రెండు రోజుల క్రితం పంచాయతీ లో రాజీ జరిగినట్లు సమాచారం.ఈ విషయమై పోలీసులకు పిర్యాదు అందలేదు.

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

- నేడు పాడేరులో చలో కలెక్టరేట్
- గిరిజనులు తరలి రావాలి
- గిరిజన సంఘం పిలుపు



మాట్లాడుతున్న చిన్నయ్యపడాపల్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో ఈనెల 11న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి అన్ని ప్రాంతాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఏపీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ఎర్రవరం ప్రాంతంలో బుధవారం గిరిజన సంఘం నాయకులు పర్యటించి చలో కలెక్టరేట్ కార్యక్రమం పై ప్రజలకు తెలియపరిచారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో గిరిజన సంఘం అల్లూరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, పోరాటంతోనే హైడ్రో పవర్ ప్రాజెక్టు ఆపుదాం రేపు జరిగే చలో కలెక్టరేట్కి కదలి రావాలని పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధిత గ్రామాల గిరిజనులతో సమావేశం నిర్వహించి పోరాటమే మన ముందున్న మార్గమని వేరే మార్గం లేదని అన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

చలో కలెక్టరేట్ కి ప్రధానమైనటువంటి అంశాలు బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని రద్దు చేయాలిజీవో నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించి 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలి. అల్లూరు జిల్లాలో చింతపల్లి, కొయ్యూరు, అనంతగిరి మండలాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని రద్దు చేయాలి. కాఫీ రైతులకు 2018 నుండి 2022 వరకు 60 కోట్ల నిధులు గిరిజన రైతులకు ఇవ్వాలనే ప్రధానమైన డిమాండ్లతో ఈ కార్యక్రమం జరుగు తుందని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్. హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధితులు గూడెపు రాజు, రామకృష్ణ, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పృధ్వీరాజ్,,,

పెదబయలు :ఈనెల 11న చేపట్టే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలనీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము పృధ్వీరాజ్ కోరారు. మండల కేంద్రంలో గోడపత్రికలను గిరిజన సంఘం పూర్వ అధ్యక్షుడు బొండా సన్నిబాబు, స్థానిక వైస్ సర్పంచ్ బి గంగాధరం, సీఐటీయూ నేత సిహెచ్ రామారావు, మండల కమిటీ నాయకులు జె.సునీల్ ఆవిష్కరించారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము పృధ్వీరాజ్ మాట్లాడుతూ, బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని రాష్ట్ర అసెంబ్లీ లో చేసిన తీర్మానన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలన్నారు. గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతంలో ఉన్న అటవీ సంపదను బడా కార్పొరేట్‌లకు కట్టబెట్టాలని చూస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70 పటిష్టంగా అమలు పరచాలన్నారు. గిరిజన ఉద్యోగులు, మేధావులు, విద్యార్థి సంఘాలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.



ఆందోళన చేపడుతున్న గిరిజనులు

రేషన్ కార్డులు పునరుద్ధరించాలని..

గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామంలో రేషన్ కార్డులు తొలగించిన లబ్ది దారులతో బుధవారం ఆ గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటిసభ్యులు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా సంక్షేమ పథకాలు పొందుతున్న పేద గిరిజనులకు 5ఎకరాల పైబడి భూములు ఉన్నాయని, కీల్లో అర్జున్, బురిడీ రామచంద్ర, కొర్ర పూర్ప్, కొర్ర మిన్ను, గోల్లోరి శ్రీనివాసరావు, గోల్లోరి రామచంద్ర, కొర్ర సహాదేవ్, గోల్లోరి గాసి అనే గిరిజనులకు ఇటీవల కాలంలో రేషన్ కార్డులు తొలగించడంతో రేషన్ కార్డు ద్వారా పొందుతున్న పథకాలు, నిత్యావసర సరుకులు, ఫించన్లు తొలగించడంతో తీవ్ర ఆందోళన చెందు తున్నారన్నారు.ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికి ఉచిత సంక్షేమ పథకాల అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పు కొంటుంది తప్ప పూర్తిగా అమలు పరచ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టి.రామారావు, జి.జగన్నాధం, కె రామకృష్ణ పాల్గొన్నారు.

మూగజీవి మృత్యువాత

ప్రజాశక్తి- పెదబయలు రూరల్:మండలంలో గోమంగి పంచాయతీ మారుమూల ప్రాంతమైన కరుకొండ గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం భారీ వర్షానికి పిడుగు పడింది. దీంతో కరెంట్ స్తంభం తెగిపోయి స్తంభానికి ఎర్త్ ఏర్పడింది. ముగ జీవి స్తంభాన్ని అంటుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామానికి చెందిన సోకెలి లక్ష్మణ రావు తెలిపారు. సంభందిత విద్యుత్ శాఖ కు సమాచారం తెలపగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ తీగను సరిచేయలేదని గ్రామస్తులు కొండబాబు, కె.పండన్న ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలందించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. జగనన్నకు చెబుదాం కోసం రాష్ట్ర ప్రభత్వం 1902 టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసిందని వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పందనలో మార్పులు, చేర్పులు చేయడం జరిగిందన్నారు. 1902 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే ముఖ్య మంత్రి కార్యాలయంలో అధికారులు సమస్యను నమోదు చేసి సంబంధిత అధికారికి సమాచారం అందిస్తారని చెప్పారు. వాటిపై రంపచోడవరంలో సోమవారం, చింతూరులో బుధవారం, పాడేరులో. శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. స్పందనలో 1300 పై చిలుకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. భూ సమస్యలు, తాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. సమస్యల పరిష్కారంలో సక్రమంగా స్పందించని అధికారులపై ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నిర్దిష్టమైన గడువులోపు సమస్యల పరిష్కారానికి జిల్లా, మండల స్థాయిలో విచారణ అధికారులను నియమించడం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. సుమోటోగా తీసుకుని జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని సచివాలయం సబ్బందికి ఉత్తర్వులు జారీ చేసామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు రూ.22 కోట్ల మేరకు బిల్లులను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. రోడ్డు, విద్యుత్తు, పారిశుద్ధ్యపు పనులు ఇతర నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం అను సంధానం చేస్తున్నామన్నారు. జిల్లాలో 2327 సెల్ టవర్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. గంజాయి సాగు నిర్మూలనలో భాగంగా 10 వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలకు ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి మండలాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. మరో 13 వేల ఎకరాల్లో కాఫీ విస్తరణకు చర్యలు చేపట్టామన్నారు. 16 వేల ఎకరాల్లో కాఫీ పునరుద్దరణ పనులకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.కాఫీ సర్సరీలు పెంపకానికి కాఫీ బోర్డు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆయా నిధులతో 52 కాఫీ సర్సరీలు పెంపకం చేపట్టడం. జరిగిందని చెప్పారు. 40 వేల కేజీల పాలీ బ్యాగులను రైతులకు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. 1 కోటి 80 లక్షల కాఫీ మొక్కలను రైతులకు అందిస్తామన్నారు. తాగునీటి పథకాలు, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యతా భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.70 కోట్ల 40 లక్షల బిల్లులు విడుదల చేసిందని చెప్పారు. మరో రూ.100 కోట్లతో తాగునీటి పథకాలు, రోడ్లు, వంతెనలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని చెప్పారు.రాజమండ్రి నుండి విజయనగరం వరకు 516 ఇ జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 128 మంది వైద్యులను కేటాయించామని, గత ఆరు నెలలో 75 మంది వైద్యులను నియమించడం జరిగిందని చెప్పారు. జిల్లాకు 13140 ఇళ్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. వివిధ నిర్మాణ దశలలో ఉన్న ఇళ్లకు రూ.28 కోట్లను లబ్దిదారుల ఖాతాకు జమ చేసారని అన్నారు. మరో రూ.12 కోట్లకు ఎఫ్ ఓలు జనరేట్ చేయడం జరిగిందన్నారు. రెండు నెలలో ఐదు వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ఆదేశాలు జారీ చేసామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి

జెడ్‌పి సిఇఒ శ్రీరామమూర్తి



మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: పంచాయితీ పరిధిలోనున్న ఆర్థిక వనరులపై దృష్టి సారించేందుకు స్థానిక పంచాయతీ అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలని జెడ్పి సీఈవో పి.రామమూర్తి అధికారులకు సూచించారు. మండలంలోని పోతంగి, అరుకు సచివాలయ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీకి సమకూరుస్తున్న ఆర్థిక వనరులపై ఆయన పంచాయతీ సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నును సకాలంలో వసూలు చేయడంతో పాటు, వ్యాపారపరంగా నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ నిర్మాణాలపై కూడా పంచాయతీ పరిధిలో అధికారులు తీర్మానం చేసి ట్యాక్స్ వసూలు చేసుకోవాలన్నారు. పంచాయతీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి అవసరమైన చోట డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి స్థానికులు ఉపయోగించిన చెత్తచెదారాన్ని డస్ట్ బిన్లు పడేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తా చెదారాన్ని తొలగించేందుకు యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రజలకు చెప్పాలన్నారు. పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలంటే తప్పనిసరిగా ఇంటి పన్నులు వసూలు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ సిబ్బంది కార్యాలయానికి పరిమితం కాకుండా పంచాయతీ పరిధిలోని ఉన్న ప్రభుత్వ అస్తులతోపాటు ఇతర రకాలుగా ఆదాయం సమకూరే వాటిపై దృష్టి సారించి వసూలు చేసుకోవాలని చెప్పారు. పన్నులు, యూజర్ చార్జీలు వసూలు చేసేటప్పుడు ముందుగా ప్రజల్లో నుంచి వ్యతిరేకత రాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్, ఈవోపీఆర్డి, ఏపీవో దొరబాబు, పంచాయతీ కార్యదర్శులు విజయ్, బాలకృష్ణ, వీఆర్పీ సంతకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అనంతగిరి:మండలంలోని పలు పంచాయితీ గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను సీఈవో శ్రీరామమూర్తి పరిశీలించారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన స్థానిక జెడ్పిటిసి గంగరాజుతో కలిసి జరిగిన పనులను పరిశీలించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంను సందర్శించి అధికారుల పనితీరు, జరుగుతున్న అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. టోకూరు సచివాలయం సందర్శించారు. సిబ్బంది పనితీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం పెద్దూరు గ్రామంలో నిర్మించిన రసబండ, బొడ్డచెట్టు కాలనీ, టోకూరు పంచాయతీ పరిధి జాకర వలస గ్రామంలో నిర్మించిన సిసి రోడ్డు పనుల నాణ్యతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కే మొస్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్, జెఇ. భరణి పాల్గొన్నారు



పని ప్రదేశంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ బాపన్న దొర

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అడ్డతీగల

మండలంలోని వేటమామిడి పంచాయతీ పరిధి పనుకురాతిపాలెం గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద జరుగుతున్న చెరువుగుంట పనులను ఎంపిడిఒ కె.బాపన్నదొర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాస్టర్ రూల్ పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 59 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. వీటిలో నీటి నిల్వ సంరక్షణ చెరువులు 12, జీడిమామిడి మొక్కలు చెట్టు చూట్టు కందకాల పనులు 12, పంటకాలువ పూడిక తీత పనులు 20, పుంత రోడ్డు పనులు 6, సరిహద్దు కందకాల పనులు 14 జరుగుతున్నట్లు తెలిపారు. రూ.2,15,00,000 విలువ గల 64 పనులను 2,553 కూలీలతో చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతులు

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని తామరపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని ఎం.బురుగుబంద గ్రామంలో బోరుబావికి బుధవారం మరమ్మతులు చేశారు. ముసురిమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం సోమవారం సచివాలయాన్ని సందర్శించిన సందర్భంగా బోరు పని చేయడం లేదని వాలంటీర్లు ఫిర్యాదు చేయగా, ఈ మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా బోరు మరమ్మతులు చేయించినట్లు ఎంపిటిసి వంశి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కుంజం అబ్బులు, వికి బాబూరావు, కుంజం చెల్లన్న దొర, కోసు వెంకట్రావు, వాలంటీర్లు పాల్గొన్నారు.



బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

43 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు : అక్రమంగా తరలిస్తున్న 43 కేజీల గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ కథనం ప్రకారం... ముందస్తు సమాచారం మేరకు మంగళవారం మారమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా ఆ వాహనాన్ని నిలుపుదల తనిఖీ చేశారు. వారివద్ద ఉన్న బ్యాగ్‌లో 43 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో సీలేరుకు చెందిన షేక్ ఆలీ, బుద్ధ లోకేష్‌కు ప్రమేయం ఉండగా, తెలంగాణ రాష్ట్రం భద్రాచలం కొత్తగూడెం జిల్లా పాలవంచకు చెందిన సవలము ప్రకాష్, ముదిగుండ ప్రశాంత్ కుమార్, అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన శెట్టి విశ్వనాథం గంజాయి తరలింపు చేశారు. నిందితుల నుండి నాలుగు సెల్ ఫోన్లు, రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, దీనిపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎవరు పట్టుబడిన కేసులు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది

వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాజేశ్వరి, ఆ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ టిడిపి రంపచోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యాన బుధవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలపై భారాలో మోపుతూ ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం అన్నం పెట్టే రైతన్నలను ఇబ్బంది పెడితే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. వెంటనే కల్లాల్లో తడిసిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, నాయకులు గొర్లె సునీత, దిండి జనార్ధన్, బొడ్డేటి వీరబాబు, చక్రపాణి, కొమరం రామన్న దొర, బాబ్జి, సాధన సత్యవతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెదబయలు : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 13 నుండి 30 వరకు సంబందించిన ధ్రువ పత్రాలతో ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ రామ్‌నాయక్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థి, పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులు మాత్రమే బైపిసి, ఎంపిసి, హెచ్ఇసి, ఎం ఎల్‌టిఎం, ఇసి గ్రూప్ లలో చేరవచ్చని అన్నారు.ఆసక్తి గల విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు

పెదబయలురూరల్ : మండలంలోని గోమంగి మినీ గురుకులంలో (బాలికలు) 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 12నుండి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వి.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు ఖాళీగా ఉన్న వివరాలు 1వ తరగతిలో- 30, రెండోవ తరగతిలో 4, ఆరవ తరగతిలో 3 సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9492671307, 9494797487కు సంప్రదించాలని కోరారు.



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్ఐ నరేంద్ర ప్రసాద్

యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని రాజవొమ్మంగి ఎస్సై టీజీ నరేంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎస్.వనక రాయి గ్రామానికి చెందిన యువతకు రాజవొమ్మంగి ఎస్ఐ ఆధ్వర్యాన బుధవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలకు సెలవుల కారణంగా విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులు, అసాంఘిక కార్యకలాపాలకు, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందించుకోవచ్చని చెప్పారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవికాలంలో యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా వారిలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు వాలీబాల్ కిట్లు, ఇతర క్రీడా సామాగ్రి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

వైభవంగా పట్టాలమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని తంటికొండ పంచాయితీ పరిధి వట్టిగడ్డలో గ్రామ దేవత పట్టాలమ్మ తల్లి జాతర మహోత్సవం కులమతాలకతీతంగా వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు ఈ పండగ నిర్వహించారు. గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ శివారున ఉన్న పట్టాలమ్మ తల్లి గుడివద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన కాంతార, అఘోర వేషాలు, కోలాటం, గరగలు నృత్యాలు, శక్తి వేషాలు, థింసా నృత్యం, హైదరాబాద్ వారిచే డిజె కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ ఆగురి సుబ్బలక్ష్మి రమణ, ఉప సర్పంచ్ పల్లి వెంకటరమణ ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాల్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కాంతార నృత్యం చేస్తున్న కళాకారులు



పాటలు పాడుతున్న చిన్నారులు

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ లో భాగంగా బుధవారం చిన్నారులకు పాటలు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 32 మంది చిన్నారులు పాల్గొని పాటలు పాడి వారి ప్రతిభను కనబర్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత, సిబ్బంది కె సుబ్బారావు, చిన్నారులు పాల్గొన్నారు.

పెదబయలు రూరల్: గిరిజన ఉద్యోగుల భవనంలో వేసవి విజ్ఞాన వినోద కార్యక్రమాలను అఖిల ఉద్యోగ సంఘ నాయకులు చెండా బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అందని సెల్ సిగ్నల్స్

ప్రజాశక్తి - పెదబయలు రూరల్: అడుగులపుట్టు పంచాయతీ సంపంగి పుట్టు గ్రామంలో నూతనంగా జియో టవర్ ఏర్పాటు చేశారు. సెల్ సిగ్నల్స్ అందుబాటులో లేక వినియోగదారుల అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి పునర్నిర్మించి సెల్ సాంకేతికలు ప్రిక్వెన్స్ అందజేయాలని కోరారు.

క్లాప్ డ్రైవర్ల భిక్షాటన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జెసిఎల్ ఆదేశం మేరకు జిఒ 7ను అనుసరించి క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు వందలాదిమంది క్లాప్ డ్రైవర్లు భిక్షాటన చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం గేటు వద్ద రూ.18,500 జీతం చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, గురువారం విశాఖ నగరానికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన స్వహస్తాలతో విడుదల చేసిన జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం వివక్ష లేకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన డైరెక్షన్‌ను అమలు చేయించాలని కోరారు. యూనియన్ తరఫున ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ దోపిడీ వ్యవస్థ లేకుండా ఆప్కాస్‌ను తెచ్చామని జిఒ 136 తెచ్చారు, మరలా క్లాప్ డ్రైవర్ల వ్యవస్థలో కాంట్రాక్టర్లను పెట్టడం సమంజసం కాదన్నారు. సిఎం ఇచ్చిన జిఒ ప్రకారం రూ.18,500 చెల్లించకుండా కేవలం రూ.12,500 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఇది అన్యాయం అన్నారు. అవినీతిని సహించనన్న సిఎం మాట నిలుపుకోవాలన్నారు. కటింగులు పోగా రూ.10 వేలు వస్తే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని యూనియన్ నాయకుడు ఎస్.అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, కార్మిక సమస్యలు చెప్పుకోడానికి ముఖ్యమంత్రి ఇంటర్వ్యూ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.రమణ, నాయుడు, అప్పారావు, సురేష్, అప్పన్న, అభి, సుధాకర్, రామకృష్ణ ప్రసంగించారు.

మోదకొండమ్మ జాతరకు భారీ బందోబస్తు

1400 మంది సిబ్బంది నియామకం
ఎఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి- పాడేరు: రాష్ట్ర గిరిజన జాతర మోదకొండమ్మ అమ్మవారి మహోత్సవాలలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు 1400 పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పాడేరు ఏఎస్‌పి ధీరజ్ వెల్లడించారు. మోదమ్మ జాతరకు జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో అనుసరించవలసిన ట్రాఫిక్ నియమావళి పై పోలీస్ శాఖ ద్వారా ముద్రించిన పోస్టర్లను ఎఎస్పి ధీరజ్, సీఐ సుధాకర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జాతరకు పాడేరు పట్టణంలో చేపడుతున్న పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను వివరించారు. వాహనాల రద్దీని క్రమబద్ధీకరించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియమావళిని అమలు చేస్తున్నామని చెప్పారు. అరకు, పెదబయలు, హుకుంపేట వైపు నుండి పండగ నిమిత్తము వచ్చే వాహనాలను తలారిసింగి సిఏహెచ్ స్కూల్ వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని అటువైపు వచ్చే వాహనాలన్నీ అక్కడే పార్క్ చేయాలని సూచించారు. పెదబయలు, హుకుంపేట నుండి చోడవరం, జి.మాడుగుల వెళ్ళవలసిన వాహనాలు - అడ్డుమండ మీదుగా సంతాడపల్లి చెక్ పోస్ట్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. జి.మాడుగుల నుండి పండగ నిమిత్తం వచ్చే వాహనాలు సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలం వద్ద పార్క్ చేయాలన్నారు. మాడుగుల నుండి పెదబయలు, హుకుంపేట, చోడవరం వెళ్ళే వాహనాలు లగిసపల్లి, నక్కలపుట్టు, వంతాడపల్లి, అడ్డుమండ మీదుగా వెళ్లాలని, చోడవరం వైపు నుండి పండగకు వచ్చే వాహనాలు జంక్షన్ వద్ద పార్కింగ్ స్థలం వద్ద పార్క్ చేయాలన్నారు. చోడవరం వైపు నుండి జి. మాడుగుల వైపు వెళ్ళే వాహనాలు నక్కలపుట్టు, లగిసపల్లి, సెయింట్ ఆన్స్ జంక్షన్ మీదుగా వెళ్లాలని సూచించారు. జాతర సందర్భంగా ఈ నెల 13 నుండి 17 వరకు ఘాట్ రోడ్డులో మరియు పాడేరు మీదుగా వెళ్లే భారీ వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. జేబు దొంగల నుంచి మొబైలు ఫోన్, విలువయిన వస్తువులు జాగ్రత్తగా భద్రపరుచు కోవాలని సూచించారు. చిన్న పిల్లలను జాతరలో విడిచి పెట్ట రాదని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనవసరంగా వాహనాలతో జాతరలో తిరగ రాదని తెలిపారు. పండుగ ప్రాంతాలలో మద్యం తాగి వాహనాలు నడప రాదని ఇంటి కి వెళ్లేటప్పుడు ప్రజలు తమ వాహనాలను నెమ్మదిగా జాగ్రత్తగా నడపి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఎస్‌పి

సిపిఎం, గిరిజన సంఘం పోరాటంతో..

ముమ్మరంగా బ్రిడ్జి పనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీ జయంతివలస, కొత్తవలస రోడ్డు వంతెన సిపిఎం, గిరిజన సంఘం పోరాట ఫలితంగా వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం 2019 (ఎస్ సి ఎ)లో సెంట్రల్ గ్రాంట్ రెండు కోట్లు నిధులు మంజూరు చేసింది. గుత్తేదారుడు 2019 డిసెంబర్‌లో పనులు ప్రారంభించి గోడ వరకు ఫిలర్స్ లెవెల్ వరకు పనులు చేశాడు. బిల్లులు రాలేదని గుత్తేదారులు మధ్యలోని పనులు నిలిపివేశారు.దీంతో మళ్లీ సిపిఎం, గిరిజన సంఘం నాయకులు గిరిజనులు కలిసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని పాదయాత్ర చేపట్టారు. ఈ పోరాట ఫలితంగా గత నెల నుండి బ్రిడ్జి పనులు ప్రారంభించి బుదవారం బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తి చేసారు. బ్రిడ్జి నిర్మాణం పనులు నాణ్యత పాటించాలని బుధవారం పరిశీలించిన గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గత్తుం బుజ్జిబాబు, నాయకులు కె.బుజ్జిబాబు, టి.జోషి తెలిపారు. ఆనంతరం వారు మాట్లాడుతూ, అనేక రూపంలో పోరాటం చేయడంతో ఫలితంగా బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి అయ్యిందన్నారు.



పనులను పరిశీలిస్తున్న నాయకులు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2024 ఎన్నికలు సమీపిస్తుండడంతో విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యటనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రాధాన్యతగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలకు ఆయన కదలికలు ఉన్నా ఉత్తరాంధ్ర అంటే ప్రత్యేకంగానే ఆ పార్టీ శ్రేణులు చెప్పడం తెలిసిందే. విశాఖను రాష్ట్ర పరిపాలనా రాజధానిగా చేసుకోవడంతో పర్యటనల తాకిడి నగరం ముఖద్వారంగా ఇటువైపు పెరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం రానున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. విశాఖను రాజధానిగా ప్రకటించిన వైసిపి ప్రభుత్వం, సిఎం వైఎస్ జగన్ విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, శంకుస్థాపనలు చేశాక గాని అడుగుపెట్టరన్న విషయాన్ని ఇప్పటికే విశాఖ, రాష్ట్ర వైసిపి నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇటీవల విశాఖకు విచ్చేసిన సందర్భంగా అదానీ డేటా సెంటర్‌కు పునాదిరాయి వేశారు. తాజా పర్యటన సందర్భంగా పిఎం పాలెం స్టేడియంలో వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో కేన్సర్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్ సిఎం పర్యటన ప్రదేశాలను పర్యవేక్షించారు.

నేటి ప్రాజెక్టులన్నీ అనేక ప్రత్యేకతల కలబోత...

రామ్‌నగర్‌లోని విఎంఆర్‌డిఎ కాంప్లెక్స్, ఎంవిపిలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కూడా సిఎం ప్రారంభిస్తారు. ఎండాడలోని కాపు భవనం, భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇతర నేతలు, కార్యకర్తలతో జగన్ ప్రత్యేక సమావేశాన్ని కూడా ఈ సందర్భంగా నిర్వహించనున్నారు. సీ హారియర్ యుద్ధ విమానం అనేక రక్షణ రంగ ప్రత్యేకతలతోనూ కలగలిసి ఉంటుంది. ప్రపంచంలో రెండు చోట్లే సీ హారియర్ మ్యూజియం ఇప్పటివరకూ ఉండగా విశాఖ కూడా తాజాగా మూడో స్థానం దక్కించుకుంది. సుమారు రూ.10కోట్లతో నిర్మించారు. టూరిస్టులకు వినోదాన్నే కాదు రక్షణ రంగ విజ్ఞానాన్ని కూడా అందించనుంది. ఇప్పటికే టియు 142, కురుసుర సబ్‌మెరైన్ ఆర్‌కెబీచ్‌లో కొలువైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే పాయకరావుపేట వైసిపి ఎమ్మెల్యే కుమారుడి వివాహ రిసెప్షన్‌కు జగన్ హాజరవుతారు.

ఎంవిపిలోని స్పోర్ట్స్ ఎరీనా సైతం 300 మంది ప్రేక్షకులు కూర్చొని క్రీడా కార్యక్రమాలు తిలకించేలాగ అధునాతన హంగులతో తీర్చిదిద్దడం ప్రత్యేకతగా నిలిచాయి. సిఎం గత విశాఖ పర్యటన అంతా హెలికాప్టర్‌లోనే వేదికల వద్దకు సాగగా, ఈ దఫా మాత్రం రోడ్డు మార్గంలోనే ఉంటుంది.

సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగా సిఎం పాలన

ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి విశాఖకు తాను తరలి వస్తున్నానని, రాష్ట్ర పరిపాలన ఇక్కడ నుంచే చేపడతానని ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపన చేసేందుకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి జగన్ చెప్పిన సంగతి తెలిసిందే. ఈ ప్రకారం విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసేదిశగా పలుమార్లు నగరానికి రానున్నట్లు తెలుస్తోంది. హనుమంతవాక వద్ద ఫ్లై ఓవర్‌కు సైతం త్వరలో శంకుస్థాపన చేస్తారని వైసిపి శ్రేణులు చెబుతున్నాయి. ఆర్‌కె.బీచ్‌లో ఉండే పలు సౌకర్యాలను సాగర్‌నగర్ వైఎస్ఆర్ వ్యూ పాయింట్ పేర కల్పించడంతో ఈ వ్యూ పాయింట్ ప్రజల ఆదరణను పొందుతోంది. రుషికొండ వరకూ సాగర తీరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దే ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన

నేటి నుంచి మొక్కజొన్న కొనుగోలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మొక్కజొన్న కొనుగోలు చేపట్టనున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ కె.రమేష్ వెల్లడించారు. బుధవారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రస్తుత రబీ సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారన్నారు. అయితే పండించిన మొక్కజొన్న అమ్మకానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గురువారం నుంచి కృష్ణాపురం, పాండ్రంగి, బాందేవుపురం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గురువారం నుంచి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించ వచ్చని సూచించారు. క్వింటా మొక్కజొన్నను ప్రభుత్వ ప్రకటించిన మద్దతుధర రూ.1962కు కొనుగోలు చేస్తామన్నారు. మొక్కజొన్నలో 14 శాతం తేమ, ఇతర నిబంధనలు వర్తించేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి.వెంకటాచలం, డిపిఎం, వైదేహి, సిసిలు పద్మ, రమణ, లక్ష్మీ, రమణమ్మ పాల్గొన్నారు.

సిపిఐ నేత గున్నారావుకు ఘననివాళి

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఐ నేత తెడ్లాపు గున్నారావు ద్వితీయ వర్థంతి స్థానిక జిఆర్.భవన్‌లో బుధవారం నిర్వహించారు. గున్నారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవభారత్ అసోసియేషన్ అధ్యక్షులు సుంకర రాంప్రసాద్ మాట్లాడుతూ, గున్నారావు బహుముఖ ప్రజ్ఞాశాలిఅన్నారు. పార్టీ సీనియర్ నాయకులు అల్లు బాబూరావు మాట్లాడుతూ, పార్టీ, ప్రజాసంఘాల అభివృద్ధికి గున్నారావు ఎంతగానో కృషి చేశారన్నారు. వ్యవసాయ, కల్లు గీత కార్మికుల సమస్యలపై పనిచేశారని గుర్తుచేశారు. సభలో చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, నవ చైతన్య కళా నాట్య మండలి అధ్యక్షులు సరగడం చిన్నరెడ్డి, పార్టీ నాయకులు కె రాంబాబు, సిహెచ్ అప్పలసూరి, ఎం వీర్రాజు, టి సోమరాజు పాల్గొన్నారు

పుస్తక పఠనం అలవరచుకోవాలి

ప్రజాశక్తి- పెందుర్తి : శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మూడవరోజు బుధవారం వివిధ పాఠశాలల నుండి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ సూర్యకళ పర్యవేక్షణలో టీచర్ ఎం మహేశ్వరరావు కథలు రాయడం, కథలు చదవడం వంటి మంచి అలవాట్లను విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కథలు చదివే కంటే, పుస్తకాల్లోని కథలు చదవడం మంచిదన్నారు. మాతృభాష గొప్పతనం తెలియజెప్పారు. డైట్ టీచర్ సబీనా యాస్మిన్ స్పీడ్ మాథ్స్, మరో డైట్ టీచర్ బషీరా కథలు రాయడంపైనా, డాన్స్ టీచర్ శార్వాణిదేవి కూచిపూడి నాట్యాన్ని విద్యార్థులకు నేర్పించారు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

సింహాచలం: అడవివరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మూడో రోజు బుధవారం లైబ్రేరియన్ నర్సింహం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం వలన విజ్ఞానంతో పాటు వినోదం ఆహ్లాదం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఎంతో ప్రయోజనమన్నారు. టీవీలు, సెలఫోన్లకు అతుక్కుపోయి ఆరోగ్యం పాడుచేసుకునే కంటే, పుస్తకపఠనంపై విద్యార్థులు ఆసక్తి చూపాలని సూచించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 213/6పి, .214/1, 216/1లలో సుమారు 5.36 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, రెవెన్యూ రికార్డుల్లోనూ నమోదు చేయించుకుని క్రయవిక్రయాలను సిద్ధమౌతున్నారని ఆ గ్రామానికి చెందిన రైతులు బుధవారం తహశీల్దార్ తోట శ్రీవల్లికి ఫిర్యాదు చేశారు. పొలానికి కాలువగా ఉన్న ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారుల అండదండలతో, స్థానిక నేతల ప్రోద్బలంతో పట్టాదారు పాసుపుస్తకాల్లోనూ, '1బి' రికార్డుల్లో కొంతమంది వ్యక్తులు నమోదు చేయించుకుని క్రయవిక్రయాలను ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారితోపాటు వారికి సహకరించిన అధికారులు, నేతలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని వేడుకున్నారు.తహశీల్దార్‌కు ఎం.అప్పారావు, రెడ్డి చిన్నారావు, ఆర్ఎస్.నాయుడు, రెడ్డి రామారావు ఫిర్యాదు చేశారు.

పెన్షనర్ల సమస్య పరిష్కారానికి పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి -ములగాడ : ఎఐసిసి పిలుపుమేరకు ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధానమంత్రికి రాసే పోస్ట్‌కార్డు ఉద్యమంలో సంఘ సభ్యులంతా పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ కె హుస్సేన్, జోన్ కార్యదర్శి కె.నూకరాజు పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు వెంకన్నపాలెం మల్కాపురం కార్యాలయంలో సిహెచ్ తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయేది ఎన్నికల సంవత్సరం కావడంతో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రధానిపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమం తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇపిఎఫ్ కార్యాలయం నుంచి వెలువడిన నోట్ ఆధారంగా మినిమం వెయ్యి రూపాయల పెన్షన్‌కే బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లు కేటాయించారని, అంతకుమించి పెన్షన్ పెంపునకు అవకాశం లేదని కేంద్ర ఆర్థికమంత్రి వెల్లడించినట్లు తెలిపారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా 1.16శాతం నిధిని ప్రభుత్వానికి బదులుగా, యాజమాన్యాల కంట్రిబ్యూషన్ నుంచి మినహాయించడం అన్యాయమన్నారు. 2014 సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందు రిటైరైన వారికి పెన్షన్‌కు అవకాశం లేదని, దీనిపై ఐక్యపోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్నాను నూకరాజు

బంగారం కోసమే దారుణం?

- ఆలస్యంగా వెలుగుచూసిన మహిళ హత్య ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు ఆటోడ్రైవర్



హతురాలు గోపి



నిందితుడు రాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వివాహిత హత్య కేసులో ఆటోడ్రైవరే నిందితుడిగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మహిళ వద్ద నున్న బంగారం కాజేయడానికి హత్యకు పాల్పడి ఉండవచ్చుని అనుమానిస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం...

జివిఎంసి ఒకటోవార్డు తగరపువలస, బాలాజీనగర్, యాతపేటకు చెందిన రీసు గోపి (30) అనే వివాహిత ఈ నెల ఒకటో తేదీన హత్యకు గురైంది. నాల్గో వార్డు చేపలుప్పాడ, పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ మైలపల్లి రాజు హత్య చేసి, గంభీరం గెడ్డలో మృతదేహాన్ని పడేశాడని అనుమానిస్తున్నారు.

ఈనెల 1న చిప్పాడ పంచాయతీ ఆశిపాలెంలో బంధువులు ఇంట్లో మేనల్లుడి పెళ్లిచూపులు కార్యక్రమానికి వెళ్లిన గోపి, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె అక్క రాము 2న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ అదృశ్యంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు గంభీరంలో శవమై తేలడంతో హత్య కేసుగా మార్పుచేసి విచారణ కొనసాగించారు. సిఐ కె లక్ష్మణమూర్తి, ఎస్ఐ హరీష్ ఆధ్వర్యంలో పోలీసులు గంభీరంగెడ్డలోని మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టానికి కేజిహెకు తరలించారు. సిఐ కె లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ కాల్‌డేటా ఆధారంగా విచారణ

హత్యకు గురైన మహిళ గోపి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, హత్యకు ముందు చివరగా ఎవరితో మాట్లాడినదీ వివరాలు సేకరించారు. చేపలుప్పాడ, పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ రాజుతో మాట్లాడినట్టు గుర్తించి, ఆ దిశలో విచారణ వేగవంతం చేశారు. మంగళవారం రాత్రి నిందితుడు రాజును మంగమారిపేట వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బంగారం కోసమే హత్య?

బంధువుల ఇంట పెళ్లిచూపులకు వెళ్లిన హతురాలు గోపి, తన వద్దనున్న సుమారు పదితులాల బంగారు ఆభరణాలను అలంకరించుకుని వెళ్లింది. అప్పటికే ఆమెతో పరిచయం ఉన్న ఆటోడ్రైవర్ రాజు, అదేరోజు సాయంత్రం ఆమెను ఆశిపాలెం రమ్మని ఫోన్‌చేశాడు. అక్కడి నుంచి ఆటోలో నేరుగా చేపలుప్పాడ, గంభీరంగెడ్డ వరకు వెళ్లిన నేపథ్యంలో గోపి వద్దనున్న బంగారాన్ని కాజేసేందుకు ఆటోడ్రైవర్ రాజు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. కాగా హతురాలు గోపితో నిందితుడు ఆటోడ్రైవర్ రాజుకు ఎటువంటి సంబంధాలు లేవని ఆమె కుటుంబీకులు అంటున్నారు. హత్యకు గురైన గోపికి వివాహంకాగా, ఏడేళ్ల క్రితం విడాకులు తీసుకుని బాలాజీ నగర్‌లో ఉంటుంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార: 46వ వార్డు లక్ష్మీనారాయణపురం-1లో రూ.38 లక్షలతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, రూ19లక్షలతో గెడ్డ రక్షణగోడ నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, ఇప్పటికే వార్డు పరిధిలో రూ.9కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వారం రోజుల్లో మరో రూ.మూడు కోట్లతో మరికొన్ని అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, ఇంకొన్ని పనులు టెండరింగ్ దశలో ఉన్నాయన్నారు. వార్డును అభివృద్ధిపరంగా ఆదర్శనీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, నాయకులు కె చిన్న, కె రామారావు, దూది నరసింగరావు, కె లావణ్య, సుజాత, సీతయ్య, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- పిఎం పాలెం : ఈనెల 16 నుంచి 19 వరకు జరగబోయే ఆంధ్రప్రదేశ్ యూత్ అంతర్ జిల్లా బాస్కెట్ బాల్‌పోటీలకు విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక ఈ నెల 13న చేయనున్నారు. విశాఖపట్నం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయి. 2007 జనవరి ఒకటి తర్వాత పుట్టిన వారే ఈ ఎంపికలకు అర్హులుగా పరిగణింపబడతారని, క్రీడాకారులు ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ తప్పని సరిగా తీసుకురావాలనీ విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అషోషియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి, సెక్రెటరీ జి భూషణరావు తెలిపారు. ఇతర వివరాలకు 8919649048, 9966753209 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

12న హెచ్‌సిఎల్ జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి -కంచరపాలెం : జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో హెచ్‌సియల్ టెక్‌బితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ప్రతినిది సాయికృష్ణ చైతన్య తెలిపారు. 2022 -23లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి. కనీసం 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన యువతీయువకులు ఈ జాబ్ డ్రైవ్‌కు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 12వ తేదీన నరవలో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848438254 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఎన్నికల స్టంట్!

తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు అనిత

ప్రజాశక్తి- సింహాచలం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఎన్నికల స్టంట్ మాత్రమేనని, దాని వల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనమేమీ లేదని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. బుధవారం సింహాద్రి అప్పన్నను కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగన్‌కు నిజంగా ప్రజా సమస్యలను విని, వాటిని పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటే, పరదాల మాటున కాకుండా నేరుగా ప్రజల్లోకి వస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, జగనన్న అదీ, జగనన్న ఇదీ అంటూ పనికిమాలిన కార్యక్రమాలను ప్రవేశపెడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేనర్నారు. జగనన్నకి చెబుదాం టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే అది పనిచేయడం లేదన్నారు.

సోలార్ దీపాలు, ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి- సీతమ్మధార : 45వ వార్డు చెంచలయ్య కాలనీలో 48 మంది కుటుంబాలకు హ్యాబిటాట్ ఫర్ హ్యూమనిటీ ఇండియా, ఆప్టిమాస్ సంస్థల సంయుక్త సహకారంతో సోలార్ దీపాలు, ఫ్యాన్లు ఉచితంగా అందజేశారు. వీటిని ఆయా కుటుంబాలకు అందజేసిన ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, సోలార్ దీపాలు, ఫ్యాన్లు వినియోగంతో కరెంట్ ఆదా చేయొచ్చన్నారు. కార్యక్రమంలోవార్డు కార్పొరేటర్ కంపా హనోక్, వార్డు అధ్యక్షులు పైడి రమణ, యుసిడి పీడీ పాపునాయుడు, జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ, చైతన్య, రవిభాస్కర్, సతీష్, రవినారాయణ, పి.రాజు, ఎ.యాకోబు, కె.బాక్కయ్య పాల్గొన్నారు.

సిఐపై సిపికి ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : తన ఇంటి రహదారి సమస్యపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరిష్కారంలో జాప్యం చేయడమే కాకుండా, ఇదేమిటని ప్రశ్నించినందుకు తనపై గ్రామంలో ప్రజలందరి సమక్షంలో సిఐ ఎస్.సన్యాసినాయుడు చేయిచేసుకున్నారని మండలంలోని నేరేళ్లవలస పంచాయతీకి చెందిన సీనియర్ టిడిపి నేత నేరేళ్ల సూర్యనారాయణ ఆవేదన చెందుతున్నాడు. ఈ మేరకు తనకు న్యాయం చేయడంతోపాటు, తనను కొట్టిన సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతనెల 14న తన ఇంటి ముందు రాకపోకల విషయమై తన తమ్ముడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేయగా, ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీనిపై అడిగినందుకు సిఐ కొట్టారన్నారు. కాగా సమస్య పరిష్కరించాల్సిన పోలీసులే ఫిర్యాదుదారుపై చేయిచేసుకోవడం దుర్మార్గమని, బాధితుడికి న్యాయం జరగకుంటే పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేస్తామనిమండల టిడిపి అధ్యక్షుడు కోరాడ రమణ అంటున్నాడు.